## మండల పరిషత్ ప్రత్యేక సమావేశం బహిష్కరణ



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

భిక్కనూరు, జూలై 1 : మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించే మండల పరిషత్ ప్రత్యేక సమావేశాన్ని బహిష్కరిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఈ సమావేశానికి రాజ్యాంగ బద్ధంగా ఎలాంటి హోదాలేని షబ్బీర్అలీని స్థానిక ఎంపీపీ, ఎంపీటీసీలను సంప్రదించకుండా ఆహ్వానించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని పిలిస్తే గౌరవం ఉండేదని అన్నారు. ఈ సమావేశాన్ని బీఆర్ఎస్‌కు చెందిన జడ్పీటీసీ, ఎంపీటీసీ, విండో చైర్మన్లు బహిష్కరిస్తున్నామని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ యాదగిరి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ తునికి వేణు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, విండో చైర్మన్లు వెంకట్‌రెడ్డి, భూంరెడ్డి, నాయకులు ప్రభాకర్, బాలాగౌడ్ పాల్గొన్నారు.

## ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం



లింగంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలిని సన్మానించిన సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్/ లింగంపేట/బిచ్కుంద/ బీబీపేట్, జూలై 1: ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్ శరత్‌కుమార్‌ను దవాఖాన సిబ్బంది ఘనంగా సన్మానించారు. లింగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు హిమబిందును దవాఖాన సిబ్బంది ఘనంగా సన్మానించారు. బిచ్కుంద మండల కేంద్రంలోని ప్రభుత్వదవాఖానలో సూపరింటెండెంట్ డాక్టర్ కాళిదాస్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే నిర్వహించారు. కేక్‌ను కట్‌చేశారు. అనంతరం డాక్టర్ కాళిదాస్‌ను దవాఖాన సిబ్బంది శాలువాతో సన్మానించారు. బీబీపేట్‌లోని ప్రభుత్వ దవాఖాన మండల వైద్యాధికారిణి డాక్టర్ భానుప్రియను రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ సభ్యులు, హెల్త్ అసిస్టెంట్ వినోద్ కుమార్ శాలువాతో సన్మానించారు.

**ఎల్లారెడ్డిలో అమ్మఒడి కార్యక్రమం**

ఎల్లారెడ్డి రూరల్, జూలై 1: ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అమ్మ ఒడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 30మంది గర్భిణులను పరీక్షించారు. వారికి రక్తపరీక్షలు చేసిన అనంతరం తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఈవో త్రివిక్రమాచారి, ఏఎన్ఎంలు శారద, ఇందిర, సుధ, పూలవ్వ పాల్గొన్నారు.

## ముత్యాల పోచమ్మకు బోనాలు

నాగిరెడ్డిపేట, జూలై1: మండలంలోని మేజర్‌వాడీ గ్రామంలో సోమవారం ముత్యాల పోచమ్మకు బోనాల పండుగను నిర్వహించారు. అమ్మవారి ముందు బోనాలను ఉంచి నైవేద్యాలను సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సిద్ధయ్య, పర్వత్‌రావు, మారుతీరావు, గోపాల్, కిషన్, మహేందర్, బాలాగౌడ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్
- 'ప్రజావాణి'కి 102 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, జూలై 1 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవె న్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. రెవెన్యూ శాఖకు 55, ఎంప్లాయిమెంట్‌కు ఒకటి, ఎడ్యుకేషన్‌కు ఒకటి, డీపీవోకు ఐదు, ట్రైబల్‌కు రెండు, ఆర్అండ్‌బీకి ఒక టి, ఎలక్ట్రిసిటీకి ఒకటి, ఎక్సైజ్‌కు ఒకటి, ఫిషరీస్‌కు ఒకటి, ఇరిగేషన్‌కు ఒకటి, హౌసింగ్‌కు తొమ్మిది, మున్సిపల్‌కు మూ డు, డీఆర్డీవోకు 13, ఎస్పీకి మూడు, సర్వే అండ్ లాండ్ రికార్డ్సుకు ఐదు ఫిర్యాదులను స్వీకరించామని తెలిపారు. ప్రజావాణితో పాటు సీఎం కార్యాలయం నుంచి వచ్చిన ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో చందర్, డీపీవో శ్రీనివాసరావు, సీపీవో రాజారాం, జిల్లా అధికారులు, రాజు, దయానంద్, వరదారెడ్డి, భాగ్యలక్ష్మి, కలెక్టర్ ఏవో మసూర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

**రాజంపేట్‌లోని తహసీల్ కార్యాలయంలో..**

రాజంపేట్, జూలై 1 : మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూకు సంబంధించిన నాలుగు ఫిర్యాదులు వచ్చాయని, వాటిని తక్షణమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనిల్‌కుమార్ తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశం, ఎంపీవో రఘురాం, ఎంఈవో రామస్వామి, ఏపీఎం సాయిలు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలలో టీవీ ధ్వంసం

- రాళ్లతో పగులగొట్టిన దుండగులు
- భారతీయ న్యాయ సంహిత చట్టం ప్రకారం జిల్లా కేంద్రంలో తొలి కేసు నమోదు



గండివేట్ ప్రభుత్వ పాఠశాలలో దుండగులు ధ్వంసం చేసిన టీవీని పరిశీలిస్తున్న గాంధారి ఎస్సై ఆంజనేయులు

గాంధారి, జూలై 1: మండలంలోని గండివేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని డిజిటల్ టీవీని ఆదివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు రాళ్లు విసిరి ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై ఆంజనేయులు పాఠశాలకు చేరుకొని ధ్వంసమైన టీవీని పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్ ఫిర్యాదు మేరకు దుండగులపై నూతన చట్టం(భారతీయ న్యాయ సంహిత)ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నిందితులను త్వరలోనే పట్టుకొని శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## నంబర్ ప్లేట్, ధ్రువపత్రాలులేని 26 వాహనాలు సీజ్



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

కామారెడ్డి, జూలై 1 : జిల్లా కేంద్రంలో పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జీవదాన్ దవాఖాన వద్ద వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంతోపాటు గ్రామాల నుంచి కొందరు వ్యక్తులు మోటర్‌సైకిళ్లు, కార్లు, ఆటోలకు నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్నందునా వాటిని పట్టుకొని కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. వాహనాలకు సంబంధించిన సరైన ధ్రువీకరణ పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 26 వాహనాలను సీజ్ చేసినట్లు చెప్పారు. తనిఖీల్లో ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలు చెల్లించాలి

కామారెడ్డి, జూలై 1 : రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు బకాయిలు చెల్లించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షలాది మంది ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు సర్కార్ సుమారు రూ.5 వేల కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనందున బకాయిలను వెంటనే విడుదల చేయడాలని అన్నారు. బీసీ విద్యార్థులకు ర్యాంకింగ్‌లతో సంబంధం లేకుండా పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, రాజేందర్, ప్రశాంత్, ఆత్మరాం, శివ, మోహన్, శ్రీధర్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ



బీర్కూర్‌లో విద్యార్థులకు యూనిఫామ్స్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీపీ రఘు

నస్రుల్లాబాద్, జూలై 1 : బీర్కూర్ మండల కేంద్రంలోని ఉర్దూ పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్‌ను ఎంపీపీ రఘు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సందీప్, మండల కో-ఆప్షన్ సభ్యుడు ఆరిఫ్, నాయకులు శశికాంత్, బస్వరాజ్, మన్నాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో 30 యాక్ట్ అమలు

కామారెడ్డి, జూలై 1 : కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ 1861ను అమలు చేస్తున్నట్లు ఎస్పీ సింధూశర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా జూలై 1 నుంచి 30వ తేదీ వరకు 30 యాక్ట్, పోలీసు యాక్ట్ 1861 జిల్లాలో అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు ఎవరైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలనుకుంటే స్థానిక పోలీసు స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## గర్భిణులకు వైద్య పరీక్షలు

నస్రుల్లాబాద్, జూలై 1 : బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ నాగ గిరీశ్ సోమవారం గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

## 4న జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ సెలక్షన్స్

కామారెడ్డి, జూలై 1 : కామారెడ్డి జిల్లా స్థాయి కిడ్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి 8, 10, 12 ఏండ్ల బాలబాలికలకు సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50.మీ, 100.మీ, 300.మీ, 400.మీ, 600.మీ, లాంగ్ జంప్, స్టాండింగ్ బ్రాడ్ జంప్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎనిమిది ఏండ్ల విద్యార్థులు 8.7.2016 నుంచి 7.7.2018 మధ్య, 10 ఏండ్ల విద్యార్థులు 8.7.2014 నుంచి 7.7.2016 మధ్య, 12 ఏండ్ల విద్యార్థులు 8.7.2012 నుంచి 7.7.2014 మధ్య జన్మించి ఉండాలని సూచించారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు బర్త్ సర్టిఫికెట్‌తో ఈ నెల 4వ తేదీ ఉదయం 8 గంటలకు జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో హాజరుకావాలని సూచించారు.

## కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

బిచ్కుంద, జూలై 1: కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ అన్నారు. బిచ్కుందలో సోమవారం జుక్కల్, మద్నూర్, బిచ్కుంద, డోంగ్లి మండలాలకు చెందిన వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి కార్మికుడికీ రూ. పదివేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్,జిల్లా కమిటీ సభ్యులు సురేశ్ గౌండ,వెంకట్ గౌడ్, మధ్యాహ్న భోజన ఏజెన్సీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సరస్వతి, సుమన్‌బాయి పాల్గొన్నారు.

## వ్యవసాయ కూలీలకు జీవన భృతి ఇవ్వాలి

గాంధారి, జూలై 1: వ్యవసాయ కూలీలకు జీవన భృతి అందజేయాలని అఖిల భారతీయ ప్రగతి శీల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వారు సోమవారం గాంధారి తహసీల్దార్ సతీశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు జీవన భృతిని అందజేయాలని కోరారు. వ్యవసాయ కూలీల సంక్షేమం కోసం సమగ్రమైన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఉద్యమిస్తామని హెచ్చరించారు. ప్రగతి శీల వ్యవసాయ కూలీ సంఘం జిల్లా నాయకుడు ప్రకాశ్, శంకర్‌రాజు, రాజేందర్, చందర్ తదితరులు ఉన్నారు.

## సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కామారెడ్డి, జూలై 1 : జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్పీల రివ్యూ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందూప్రియ మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తగా తీసుకోవాలని సూచించారు. ఆర్పీలు కలిసికట్టుగా పని చేసుకోవాలని, సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, డీఈవో జీవిత, సీవో అనసూయ, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, KURME PEDDA RAJANNA, H.No.4-9/4, Bodepally, Balkonda, Nzb. now Changed my Surname/ name as MEKALA PEDDA RAJANNA NTZ-340153

**CHANGE OF NAME**

★I, SHENKURI THIRUPATHI REDDY H.No.1-93, Surbiryal, Armoor, Nizamabad now Changed my surname/name as SHANKURI THIRUPATHI REDDY NTZ-340153

**CHANGE OF NAME**

★I, SHENKURI NARAYANA H.No. 1-93, Surbiryal, Armoor, Nizamabad now Changed my Surname/name as SHANKURI NARAYANA NTZ-340153

**WANTED**

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899. NT-325755



**CHANGE OF NAME**

★I, SHENKURI LASUMBAI H.No. 1-93, Surbiryal, Armoor, Nizamabad now Changed my Surname/name as SHANKURI LASMAVVA NTZ-340153

**CHANGE OF NAME**

★I, CHITTALA SUGUNA H.No.1-32/17, Choutpally, (M) Kammarpally, Dist.Nizamabad Changed my Surname as CHITYALA SUGUNA W/o. CHITYALA RAJANNA NTZ-340153

**CHANGE OF NAME**

★I, CHITTALA KAVITHA H.No.1-32/17, Choutpally, (M) Kammarpally, Dist.Nizamabad Changed my Surname as CHITYALA KAVITHA W/o. CHITYALA DEVENDHAR NTZ-340153

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


# ప్రతి రైతుకూ 'రైతుభరోసా' ఇవ్వాలి

ప్రత్యేక సమావేశాల్లో రైతుల డిమాండ్



మాట్లాడుతున్న నాగిరెడ్డిపేట జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

నాగిరెడ్డిపేట, జూలై1: వ్యవసాయం చేసే ప్రతి రైతుకూ 'రైతు భరోసా' పథకాన్ని వర్తింపజేయాలని జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మాల్తుమ్మెద, కిచ్చన్నపేట సింగిల్ విండోల ఆధ్వర్యంలో రైతు భరోసా పథకంపై సోమవారం రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. రైతుల నుంచి అభిప్రాయాలను స్వీకరించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడు తూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలుచేసి రైతుల మన్ననలు పొందినట్లు తెలిపారు. ఎలాంటి షరతులూ లేకుండా..పది ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని కోరారు. షరతులూ లేని రైతు భరోసా ఇవ్వాలని విండో అధ్యక్షులు గంగారెడ్డి, నర్సింహులు రైతుల తరపున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొందరు రైతులు షరుతులూ లేకుండా ఐదు ఎకరాలకు ఇవ్వాలనీ.. మరి కొంద రు 10 ఎకరాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం.. కాంగ్రెస్ ప్రభు త్వం ఎలాంటి షరతులు లేకుండా ఎకరానికి రూ.15వేలు అందించాలన్నారు. రైతుల అభిప్రాయాలను జిల్లా అడిట్ అధికారి రామ్మోహన్ నమోదు చేసుకున్నారు. ఎంపీపీ వినీత, ఏడీఏ వీరాస్వామి, ఏవో విజయశేఖర్, మాజీ ఎంపీపీ రాజ్‌దాస్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవులు, కిష్టయ్య, నాయకులు సిద్ధయ్య, దుర్గారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, విండో డైరెక్టర్లు, రైతులు బాల్గొన్నారు.

**మూడు సొసైటీల వద్ద రైతు భరోసా సమావేశాలు**

ఎల్లారెడ్డి, జూలై 1: ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల సొసైటీ, మీసానిపల్లి, ఆజామాబాద్ రైతువేదికల వద్ద సోమవారం సమావేశాలు నిర్వహించారు. అర్హులకు తప్పనిసరిగా రైతు భరోసా దక్కాలని ఏడీఏ వీరాస్వామి అన్నారు. పలువురు రైతులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. కొందరు పది ఎకరాల భూమి ఉన్న రైతు వరకు రైతుబంధు ఇవ్వాలని, మరి కొందరు ఐదు ఎకరాల భూమి ఉన్నవారికి వరకు రైతుబంధు ఇవ్వాలని కోరారు.

**నేడు సహకార సంఘాల్లో ప్రత్యేక సమావేశాలు**

లింగంపేట, జూలై 1: మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి, లింగంపేట, నల్లమడుగు గ్రామాల్లోని సహకార సంఘాల్లో మంగళవారం ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు సహకార సంఘాల సీఈవోలు శ్రీనివాస్, సందీప్, మహిపాల్‌రెడ్డి సోమవారం వేర్వేరుగా ఒక ప్రకటనల్లో తెలిపారు. సమావేశాల్లో రైతు భరోసా పథకం అమలుపై రైతులు, సహకార సంఘాల సభ్యుల నుంచి అభిప్రాయాలని సేకరించనున్నట్లు పేర్కొన్నారు. అభిప్రాయ సేకరణ ప్రత్యేక సమావేశానికి కామారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి భాగ్యలక్ష్మి రానున్నట్లు వారు తెలిపారు. సహకార సంఘాల పరిధిలోని రైతులు, సభ్యులు హాజరుకావాలని వారు కోరారు.

**రేపు డోంగ్లీలో**

డోంగ్లీ, జూలై 1: మండల కేంద్రంలోని సహకార సంఘ కార్యాలయ ఆవరణలో ఈ నెల 3న మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు కార్యదర్శి గంగాధర్ తెలిపారు.

## పోచారానికి శుభాకాంక్షల వెల్లువ



బాన్సువాడ, జూలై 1 : బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరిన అనంతరం మొదటిసారి బాన్సువాడకు వచ్చిన ఆయనకు అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని వ్యాపారులు, పోచారం అనుచరులు, అధికారులు, మండలాల నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపి శాలువాలతో సన్మానించారు.

## ప్రభుత్వ దవాఖాన సందర్శన

భిక్కనూరు, జూలై 1 : మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను జిల్లా ఉప వైద్యాధికారి శోభారాణి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా దవాఖానకు వచ్చే రోగులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. దవాఖానలో ప్రసవాల సంఖ్యను పెంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి యెమిమా, ఆరోగ్యవిస్తరణ అధికారి వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

## గుమ్మడి అనాథాశ్రమానికి ఆర్థిక సాయం

కోటగిరి, జూలై 1: మండలంలోని ఎక్లాస్‌పూర్‌క్యాంప్‌లో ఉన్న గుమ్మడి ఫౌండేషన్ అనాథాశ్రమానికి జుక్కల్ మండలం లాడేగాం గ్రామానికి చెందిన రిటైర్డ్ వీఆర్వో శంకర్‌రావు పటేల్ రూ. 20వేలు అందజేశారు. ఆయనకు ఆశ్రమం మేనేజర్ మధుకర్ కృతజ్ఞతలు తెలిపారు.

# విశ్రాంతి భవనంలో 'ప్రజావాణి'

అయోమయంలో అధికారులు, ప్రజలు



బిచ్కుందలోని విశ్రాంతి భవనంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

బిచ్కుంద, జూలై 1: మండల కేంద్రంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని తహసీల్‌లో నిర్వహించాల్సి ఉండగా.. పక్కన ఉన్న విశ్రాంతిభవనంలో నిర్వహించారు.దీంతో పలు శాఖలకు చెందిన అధికారులు, ప్రజలు ప్రజావాణి కార్యక్రమం ఎక్కడ నిర్వహిస్తున్నారో తెలియక తికమక పడ్డారు. దీనిపై తహసీల్దార్ సురేశ్‌ను అడుగగా, కార్యాలయంలో నిర్వహిస్తే పనులకు ఆటంకం కలుగుతుందని, విశ్రాంతి భవనంలో నిర్వహిస్తున్నామని సమాధానమిచ్చారు. దరఖాస్తులు ఇచ్చేవారు ఎలాగైనా ఇస్తారని తెలుపడం కొసమెరుపు. ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన సూచించారు.

**పెద్దకొడప్‌గల్‌లో ఆరు ఫిర్యాదులు...**

పెద్ద కొడప్‌గల్, జూలై 1: పెద్దకొడప్‌గల్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి ఆరు ఫిర్యాదులు వచ్చాయని తహసీల్దార్ దశరత్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయశాఖ, ఐకేపీ, ఐసీడీఎస్,విద్యాశాఖ,అటవీశాఖ తదితర శాఖల అధికారుల గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

**లింగంపేటలో దరఖాస్తులు నిల్**

లింగంపేట, జూలై 1: మండల కేంద్రంలోని తహసీల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఒక్క దరఖాస్తూ రాలేదని తహసీల్దార్ నరేందర్ తెలిపారు. అలాగే విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంలోనూ ఒక్క ఫిర్యాదూ రాలేదని ట్రాన్స్‌కో ఏఈ సాయినాథ్ తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన గ్రామస్తులు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## ఈ పాస్ యంత్రాల పరిశీలన

నాగిరెడ్డిపేట, జూలై 1: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాల్లో ఏర్పాటు చేసిన ఈపాస్ యంత్రాలను సోమవారం ఏవో విజయశేఖర్ పరిశీలించారు. స్థానిక లక్ష్మీనర్సింహా, సిద్ధిరామేశ్వర ఎరువుల దుకాణాలతోపాటు మాల్తుమ్మెద సింగిల్ విండో కార్యాలయంలోని దుకాణాల్లో ఈ పాస్ యంత్రాలను తనిఖీ చేశారు. యూరియా నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎరువులను ఈ పాస్ యంత్రాల ద్వారానే విక్రయించాలని సూచించారు. దుకాణాలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుపుకోవాలన్నారు.

## దుకాణాల్లో మున్సిపల్ సిబ్బంది తనిఖీలు

ఎల్లారెడ్డి రూరల్, జూలై 1: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులను వా డినా, విక్రయించినా జరిమానాలు తప్పవని మున్సిపల్ సిబ్బంది హెచ్చరించారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు ఆదేశాల మేరకు వారు దుకాణాలు, వ్యాపారసంస్థలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. 120 మైక్రాన్‌ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీబ్యాగులను వాడవద్దని సూచించారు. దుకాణాల్లోని చెత్తను రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో వేయకుండా చెత్త డబ్బాల్లో వేయాలన్నారు. తనిఖీల్లో మున్సిపల్ సిబ్బంది విష్ణువర్ధన్, కాశీరాం ఉన్నారు.

## ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ

రామారెడ్డి, జూలై 1: మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎనగుర్తి రాజయ్య, ఉపాధ్యక్షుడిగా కస్తూరి సాయిలు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, కార్యదర్శిగా లక్ష్మణ్, మహిళా కమిటీ అధ్యక్షురాలిగా బణాపురం లావణ్య, ఉపాధ్యక్షురాలిగా ఎల్లమానసను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## విద్యార్థులకు నూతన చట్టాలపై అవగాహన

గాంధారి, జూలై 1: మండలంలోని గండివేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నూతన న్యాయ చట్టాలపై ఎస్సై అంజనేయులు సోమవారం అవగాహన కల్పించారు. నూతన చట్టాల ప్రకారం నేరాలు చేసిన నిందితులకు శిక్షలు పడుతాయని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బంజారా సమ్మేళనానికి తరలిన గిరిజనులు

మాచారెడ్డి, జూలై 1 : మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన గిరిజనులు సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన జాతీయ బంజారా సమ్మేళనానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా గిరిజన నాయకులు మాట్లాడారు. బంజార భాష లిపిని గుర్తించి రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్ చేర్చాలని డిమాండ్ చేశారు. తరలివెళ్లిన వారిలో బన్సీలాల్‌నాయక్, ప్రకాశ్, రాజునాయక్, జబ్బర్, షాదూల్ తదితరులు ఉన్నారు.

## మతిస్థిమితం సరిగాలేక బాలిక ఆత్మహత్య

భిక్కనూరు, జూలై 1 : మండలంలోని పెద్దమల్లారెడ్డికి చెందిన బాలిక ఆత్మహత్య చేసుకున్నదని ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దమల్లారెడ్డి గ్రామంలో శ్రీధర్‌రెడ్డి అనే రైతువద్ద ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా చింతలపూడి గ్రామానికి చెందిన హరిబాబు తన కుటుంబ సభ్యలతో కలిసి కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పని నిమిత్తం భార్యాభర్తలు రామాయంపేటకు వెళ్లారు. పెద్దమల్లారెడ్డిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న చిన్న కూతురు సాయి(15) మతిస్థిమితం సరిగా లేకపోవడంతో గ్రామ శివారులో ఉన్న మామిడి తోటలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం

భిక్కనూరు, జూలై 1 : మండల కేంద్రానికి చెందిన ప్రింటింగ్ ప్రెస్ యజమాని తాటిపాముల శేఖర్‌గౌడ్ అదృశ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూరుకు చెందిన తాటిపాముల శేఖర్‌గౌడ్ ప్రింటింగ్ ప్రెస్ నడిపేవాడలన్నారు. ఎప్పటిలాగే ఉదయం 10 గంటలకు తన ప్రింటింగ్ ప్రెస్‌కు వెళ్లాడన్నారు. మధ్యాహ్నం 2 గంటలైనా భోజనం కోసం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ప్రింటింగ్ ప్రెస్‌కు వెళ్లి చూడగా కనిపించలేదని, ఫోన్ కూడా స్విచ్ఛాఫ్‌లో ఉందన్నారు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. సోమవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.